సమష్టిగా పనిచేద్దాం



సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత పరిశీలకుడు అనిల్‌రెడ్డి

కీసర: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో నేతలంతా సమష్టిగా పనిచేసి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని సీఎం వ్యక్తిగత పరిశీలకుడు అనిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కీసరలోని కేబీఆర్‌గార్డెన్‌లో నిర్వహించిన ఉమ్మడి కీసర మండలం కాంగ్రెస్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా చెయిగుర్తుకు ఓట్లు వేసేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా పార్టీలో పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయని, పాత, కొత్త నేతలంతా ప్రచారంలో దూసుకుపోవాలన్నారు. సమావేశంలో బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్, కందాడి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లో బీజేపీ విజయానికి సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ బూత్ అధ్యక్షుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికల్లో పాటించవలసిన నియమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఓటర్ తమ ఓటు హక్కును వినియోగించుకోవడంపై ప్రధానంగా నాయకులు దష్టిసారించాలన్నారు. సమావేశంలో బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రామతీర్థ, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మున్సిపల్ బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

మల్కాజిగిరి రిటర్నింగ్ అధికారి గౌతమ్



స్ట్రాంగ్ రూమ్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గౌతమ్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోగారం హోలీ మేరీ కాలేజీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్, ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. మేడ్చల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటరు రిజిస్ట్రేషన్ రిజిస్టర్లు, ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ నెల 8 వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్‌ను ఉద్యోగులందరూ వినియోగించుకునేందుకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి,అధికారులు రాజేశ్వర్ రెడ్డి రజిని,హసీనా పాల్గొన్నారు.

ఈవీఎం, కంట్రోల్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి



మాట్లాడుతున్న జిల్లా సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండోదశ ఈవీఎం, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గం సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి,డీఆర్ఓ హరిప్రియతో కలసి ఈ ప్రక్రియ ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజిగిరి,కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్,ఎల్బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2996 పోలింగ్ కేంద్రాలకు గాను ఆన్ లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్ రెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి కేంద్రీకృత అభివృద్ధి వైపు మారాలి

గుజరాత్ అటవీ దళాల అధిపతి యూడీ సింగ్



దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న అటవీ క్షేత్ర అధికారులు

సుభాష్‌నగర్: అడవులు జీవానికి ఆధారమైన జలానికి నెలవలని... మానవ కేంద్రీకృత అభివృద్ధి నుంచి ప్రకృతి కేంద్రీకృత అభివృద్ధి వైపు మారాలని గుజరాత్ అటవీ దళాల అధిపతి యూడీ సింగ్ అన్నారు. దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో శుక్రవారం 9వ బ్యాచ్ అటవీ క్షేత్రాధికారుల ప్రవేశ శిక్షణ కార్యక్రమ స్నాతకోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా గుజరాత్ అటవీ దళాల అధిపతి యూడీ సింగ్, తెలంగాణ అటవీ దళాల అధిపతి ఆర్ఎం డోబ్రియాల్ ప్రత్యేక ఆహ్వానితులుగా, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి ఎల్యూసింగ్ మేరు, తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమం కోర్సు డైరెక్టర్ వి. ఆంజనేయులు శిక్షణా కార్యక్రమం రిపోర్టును సమర్పించారు. పాసింగ్ ఔట్ పరేడ్ ను తనిఖీ చేసిన అనంతరం జరిగిన స్నాతకోత్సవ సమావేశంలో శిక్షణార్థులకు ముఖ్య అతిథి, ధ్రువపత్రాలు, ఆయా విషయాలలో ప్రతిభను కనబరచిన వారికి పతకాలు, ప్రతిభా పత్రాలను ప్రదానం చేశారు.

శిక్షణ పూర్తి చేసుకున్న 47 మంది అధికారులు..

◆ 18 నెలల పాటు మొత్తం 47 మంది అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారిలో 42 మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, నలుగురు జమ్ముకాశ్మీర్, ఒకరు లద్దాక్‌కు చెందిన వారు ఉన్నారు. వీరిలో 11 మంది మహిళా అధికారులున్నారు. గుజరాత్ కు చెందిన సురేశ్ కుమార్ దేశాయ్ బ్యాచ్ మొత్తంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి బంగారు (07) పతకాలను సాధించడంతో పాటు శిక్షణా కార్యక్రమంలో అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచారు. రోనక్ కేవడియా బంగారు (07), వెండి(03) వెండి పతకాలను సాధించారు.

◆ అదే విధంగా పార్థ్‌కుమార్ భిమాని, జనక్ రామ్ కకాడియా, మనీష్ కుమార్ పటేల్ ఒక్కొక్కరూ రెండు చొప్పున పతకాలను, జిగ్నేష్ భాయ్ మేనియా, సుమన్ మీనా, మిలన్ సోలంకి, కథమ్ పటేల్, భార్గవ్ పిపాలియా ఒక్కొక్క బంగారు పతకాన్ని పొందారు.

◆ ఈ సందర్భంగా ముఖ్య అతిథి, యూడీ సింగ్ శిక్షణ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అడవులు జీవానికి ఆలంబన అనీ, జీవవైవిధ్యం నష్టాన్ని, శీతోష్ణస్థితి మార్పు సమస్యలను ఎదుర్కోవడానికి కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో అమలు పరచాలని, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ పరిస్థితుల నుంచి కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించి అడవులను కాపాడాలన్నారు.

◆ తెలంగాణ అటవీ దళాల అధిపతి ఆర్.ఎం .డోబ్రియాల్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒకరంగంలో నైపుణ్యాలను సాధించాలన్నారు. సంస్థ కోసం పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి, ఎల్యూసింగ్ మేరు, అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆషా ప్రసంగంలో విలువైన సూచనలు చేశారు.

◆ ఈ కార్యక్రమంలో విశ్రాంత అటవీ అధికారులు ప్రదీప్, కిషన్, అటవీ అకాడమీ అదనపు సంచాలకులు ఎస్.రమేష్, అకాడమీ సంయుక్త సంచాలకులు బి.ప్రవీణ, ఉప సంచాలకులు సీహెచ్ గంగారెడ్డి, వి.రామమోహన్, కె.శ్రీనివాస్, ఎస్ఏ నాగినీ బాను, పీవీ రామకృష్ణ, సహాయ సంచాలకులు ఎం.వంశీకృష్ణ, వై.సుభాష్ చంద్రయాదవ్, ఎం.రామ్ మోహన్, షేక్ బాబా ఖాదర్ వలీ, ఉపక్షేత్రాధికారి ఉమారాణి, జె.పద్మ, సెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, ఫిజికల్ ట్రైనర్స్ కొండల్‌రావు, అశోక్‌రెడ్డి, రఫీ ఉల్లా, అనిల్, శిక్షణ అటవీ క్షేత్రాధికారులు, శిక్షణ సెక్షన్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పురుషులు ,మహిళా ఓటర్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు
మేడ్చల్	3,40,218	3,25,703
మల్కాజిగిరి	2,55,325	2,52,712
కుత్బుల్లాపూర్	3,78,362	3,46,468
కూకట్‌పల్లి	2,51,424	2,30,506
ఉప్పల్	2,79,495	2,60,516
కంటోన్మెంట్	1,26,699	1,26,997
ఎల్బీనగర్	3,14,101	2,90,528
మొత్తం	19,45,624	18,33,430

పురుషులే కీలకం

- మల్కాజిగిరి పార్లమెంట్‌లో పురుషుల ఓట్లు 1.12లక్షలు అధికం
- మొత్తం ఓటర్లు 37.79లక్షలు
- పురుషుల ఓట్లు 19.45,
- మహిళల ఓట్లు 18.33 లక్షలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో అభ్యర్థుల గెలుపోటములకు పురుషుల ఓట్లే కీలకం కానున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం ఓటర్లు 37,79,596 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 19,45,624మంది కాగా, మహిళా ఓటర్లు 18,33,430 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓట్ల కంటే పురుషుల ఓట్లు 1,12,194 అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉప ఎన్నికలు జరుగుతున్న కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్,

◆ కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లే అధికంగా నమోదై ఉన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్లు1,26,699 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,26,997 మంది ఉన్నారు. ఇక్కడ మాత్రం పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 328 మంది మాత్రమే ఎక్కువగా ఉన్నారు.

◆ **రెండు నెలల్లో పెరిగిన ఓటర్లు 51,077 మంది**

ఎన్నికల సంఘం ఫిబ్రవరి 8న తుది ఎన్నికల జాబితా ప్రకటించింది. ఈ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలలో మొత్తం ఓటర్ల సంఖ్య 37,28,519 కాగా, ఏప్రిల్ 25న ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య37,79,596 ఉంది. ఈ ఓటర్ల జాబితాను అనుసరించి దాదాపు రెండు నెలల వ్యవధిలోనే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 51,077 మంది ఓటర్లు పెరిగారు.

బీఆర్ఎస్ నేతల ఇంటింటి ప్రచారం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు వివిధ వార్డులలో పర్యటించి ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డికి ఓటు వేయాలని కోరారు. పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కౌన్సిలర్ మహేష్, నాయకులు విష్ణుచారి, వసంత,శారద తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి పలువురి రాజీనామా

మేడ్చల్: మండలంలోని సైదనిగడ్డ తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. బీజేపీ నాయకుడు నందారెడ్డి సమక్షంలో వారంతా బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నందారెడ్డి తో పాటు మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజ హరినాథ్‌లు పార్టీ కండువాలు కప్పారు.

ఈటలకు మద్దతుగా ప్రచారం



ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని మున్సిపాలిటీలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, ఉపాధ్యక్షుడు నరేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హామీలు వివరించారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరుతున్న మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు

మేడ్చల్ రూరల్: మండలంలోని సైదోనిగడ్డ తండా మాజీ సర్పంచ్ సుజాతకిషన్, మాజీ ఎంపీటీసీలు కిషన్ నాయక్, విజయ్ చందర్,సింగిల్ విండో వైస్ చైర్మెన్ శ్యాంలాల్, నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సింహ్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజహరినాథ్, నాయకులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల నగదు స్వాధీనం



శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తూంకుంటలో ఎస్ఓటీ పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎం డిపాజిట్ చేసే సంస్థకు చెందిన వాహనంలో క్యూ ఆర్ కోడ్ లేకపోవడంతో పాటు ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుండా రూ. 50 లక్షల నగదును తరలిస్తున్నారన్న సమాచారంతో మేడ్చల్ ఎస్ఓటీ దాడులు నిర్వహించారు. నగదుతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులు దృష్టి సారించాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు,అధ్యాపకులు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో స్వాస్థ అవిన్య ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజుల పాటు సాగనున్న కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ తుల్జారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు, ఎత్తు,బరువు పరిశీలించారు. ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యలపై జనహిత సేవా ట్రస్ట్ బృందం, ప్రిన్సిపాల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది మధుకర్, సరితరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలి



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న పావనీజంగయ్య, ముత్యాలు, నాగరాజ్

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేపట్టారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య హాజరై ఇంటింటికీ ప్రచారం చేశారు. బాల్‌రెడ్డి, శివప్రదీప్‌రెడ్డి, జంగయ్యయాదవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు మద్దతుగా..

- 1210 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- జిల్లాలో ధాన్యం ఉత్పత్తుల దిగుమతి 38 వేల మెట్రిక్ టన్నులు
- ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 25 వేల మెట్రిక్ టన్నులు
- నాలుగైదు రోజుల్లో మరో 10 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఘట్కేసర్ మండలంలోని మాదారం, ఎదులాబాదుల్లోని కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1210 మెట్రిక్ టన్నుల ధాన్యం జిల్లా పౌరసరఫరాల శాఖ సేకరించింది. నాలుగైదు రోజుల్లో నిర్దేశించిన మరో 10 కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఆలస్యంగా వరి కోతలు ప్రారంభం కావటంతో ఇప్పుడిప్పుడే ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందు జిల్లా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది.

పెరిగిన వరి సాగు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా, రైతులు మాత్రం 14,598 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. దీంతో వరి పంట దిగుబడి 38 వేల మెట్రిక్ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతులను అన్నీ విధాలుగా ఆదుకోవటంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతుతో ధాన్యం గ్రేడ్- ఏ క్వింటాల్ ధర రూ.2,203లకు, కామన్ ధర రూ.2,183తో కొనుగోలు చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ పేర్కొంటోంది. ఈ మేరకు ధాన్యం సేకరణ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులతో సహా కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఎండలు మండుతుండటంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 12 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు రైతులకు అందుబాటులో ఉంచారు.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చేపట్టాలని నిర్ణయించిన అధికారులు ఇప్పటి వరకు మాదారం, ఎదులాబాదులో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. త్వరలో ప్రతాపసింగారం(ఘట్కేసర్ మండలం), కేశవరం,లక్ష్మాపూర్, ఉద్దమర్రి(మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్ ,డబుల్‌పూర, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్‌పేట, అలియాబాద్, కీసర కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ జి.రాజేందర్ తెలిపారు. ధాన్యం క్రయవిక్రయాలకు సంబంధించి మధ్య దళారులను ఆశ్రయించొద్దని పేర్కొన్నారు.

లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పాటునందించండి

సీపీఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా : దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తున్న బీజేపీని ఓడించటంతోపాటు కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పాటు అందించాలని సీపీఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఎం జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడారు. రాజ్యాంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలపై దాడులు చేయటంతోపాటు లొంగని వారిపై ఈడీ, సీబీఐ కేసులు పెడుతోందన్నారు. ఈ నెల 5 నుంచి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, డోర్ టూ డోర్ ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోమటి రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికే ప్రమాదం

సీపీఐ రాష్ట్ర నేత బాలమల్లేష్

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో బీజేపీ మళ్ళీ గెలిస్తే రాజ్యాంగానికి పెను ప్రమాదం పొంచి ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్. బాలమల్లేష్ విమర్శించారు. అందుకే ఈ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపటమే తక్షణ కర్తవ్యంగా సీపీఐ కార్యకర్తలు పని చేయాలని కోరారు. శుక్రవారం నగరంలోని సీపీఐ జిల్లా కేంద్ర కార్యాలయంలో దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మట్లాడుతూ రాజ్యాంగం మార్పు కోసమే మెజారిటీ సీట్లు అడుగుతున్నామని బీజేపీ అంటుందని పేర్కొన్నారు. ఈడీ, ఐటీ, ఎన్ఐఏ,సీబీపీ వంటి సంస్థలను బీజేపీ రాజకీయ సాధనాలుగా వాడుకుంటున్నదని విమర్శించారు. ఓట్ల కోసం రాజ్యాంగమంటే గౌరవమని పేర్కొంటున్న బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే పూర్తిగా తొలగిస్తుందని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి గెలిపించాలన్నారు. సమావేశంలో జిల్లా సీపీఐ కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్, సీపీఐ నేతలు దామోదర్ రెడ్డి, ఉమామహేష్, కృష్ణమూర్తి, దశరథ్ పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల కేటాయింపు పూర్తి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల నిర్వహణలో భాగంగా మైక్రో అబ్జర్వర్లను ఆన్‌లైన్ ద్వారా జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా రెండో రాండమైజేషన్ ద్వారా కేటాయించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సమక్షంలో రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరందరికి ఈనెల 7న కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో శిక్షణ ఉంటుందని జిల్లా సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి పాల్గొన్నారు.

కన్నుల పండువగా గ్రామోత్సవం





కీసర: శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి 16వ వార్షికోత్సవ ప్రత్యేక పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి గౌడ్, ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించుకుందాం



ప్రచారంలో పాల్గొన్న క్షమిత

కీసర: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకుందామని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోడలు క్షమిత పిలుపునిచ్చారు. శుక్రవారం చీర్యాల తదితర గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏగ్రామానికి వెళ్లినా ఈసారి మాత్రం ప్రజలంతా బీజేపీకి అండగా నిలుస్తామని పేర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో..



మేడ్చల్ రూరల్: శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్కలగూడలో ప్రచారం చేపట్టి బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని వేడుకున్నారు. కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, హంసరాణి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు వాకథాన్

మల్కాజిగిరి: లెట్స్ ఓట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మల్కాజిగిరిలో శనివారం సాయంత్రం 4 గంటలకు వాకథాన్‌తో పాటు సమావేశాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మల్కాజిగిరి నుండి సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్ వరకు వాక్‌తాన్ అనంతరం సమావేశం ఉంటుందన్నారు. జీహెచ్ఎంసీ, రాచకొండ పోలీసు విభాగంతో పాటు ఇతర విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు.